


'మిత్రవింద'

‘‘హనుమా బుర్రంటే నీదేనయ్యా?’’

‘‘ఏమిటి ఇవ్వాళ లేస్తూనే కాకా ప్రారంభించావ్?’’

“కాకా కాదు స్వామీ! రాత్రి మీరు విడాకుల గురించి లెక్చరిచ్చారు. ఇప్పటి పద్ధతి వున్నా లేకి దేలెక్కన్నారు గదా ముస్లింలా ఈ విషయంలో చాలా స్వేచ్ఛను ఇస్తుందన్న మాట నిజమే! వాళ్ల ఇష్టం ఉన్నా లేకపోయినా, రోజూ పోట్లాడుకుంటూ ఒకే మంచం మీద కుళ్ళుతూ కాపురం చెయ్యక్కర్లేదు. పిల్లేక కానీ వీలుంటే హిందువుల్లో కూడా నూటికి ఏభై మంది పెళ్లాలను వదిలేస్తారు. కనీసం పాతిక మంది ఆడవాళ్లయినా సంతోషంగా బయటికి వెళ్ళిపోతారు.’’

‘‘ఏమిటి విశేషం పొద్దున్నే విడాకుల మీద పట్టించావ్?’’

నిద్ర లేస్తూనే పాత హైదరాబాద్ నగరం చూడాలనిపించింది. చల్లని గాలి పోకుతూ ఉంటే, కూని రాగం తీస్తూ వెళ్తూ ఉన్నాను! ఒక ఇంట్లోనుంచి కేకలు వినిపించాయి. నలుగురు ఆడవాళ్లు బండబూతులు తిట్టుకుంటున్నారు. జుట్లు జుట్లు పట్టుకొనే వరకూ వచ్చింది. గళ్ల లుంగీ కట్టుకున్న ఆసామి కళ్ళునులుపుకుంటూ బయటికి వచ్చాడు అతని పేరు అల్లాయార్‌ఖాన్ అని తర్వాత తెలిసింది, వాళ్లు నలుగురూ అతని భార్యలు, అతను కోపంతో పెద్ద భార్యను మందలించాడు. ఆవిడ ఎదురు తిరిగింది, ‘తలాక్ తలాక్ తలాక్’ అన్నాడు మూడు సార్లు. ఆవిడ ఏడుస్తూ వెళ్ళిపోయింది.

రెండో ఆవిడ ‘‘నీకిదేం పోయేకాలం? అన్నాళ్లు కాపురం చేసిన ఆ ఇల్లాలిని వెళ్ళగొడ్తావా’’? అంటూ తిట్లకు లంకించుకుంది.

‘‘నువ్వూ వెళ్లు! తలాక్ తలాక్ తలాక్’’

ఆమె కూడా ఏడుస్తూ కేకలు పెడ్తూ బయటికి వెళ్ళింది.

‘‘ఇద్దరు పెళ్ళాలను చిన్న తప్పుకు తలాక్ ఇచ్చి వెళ్ళగొట్టిన నిన్ను నేను మాత్రం ఎలా నమ్మాలి. నువ్వు దుర్మార్గుడివి’’ అన్నది మూడో భార్య

‘‘నీకూ తలాకే! వెళ్ళు!’’

ఆమె నిర్లక్ష్యంగా వెళ్ళి పోయింది.

‘‘నీకిదేం పోయేకాలం? ఒక్కసారిగా ముగ్గురు పెళ్ళాలకు తలాకిచ్చావ్? ఆ మాత్రానికే ఇంత మందిని ఎందుకు చేసుకున్నావ్? నీకు తోడు నలుగురు పెళ్ళాలా? మంచిదే అయింది లే! వాళ్లయినా సుఖపడ్తారు,’’

‘‘ఏంకూశావే? పో! నువ్వూ వెళ్ళు! తలాక్’’! అనీ అనకముందే నవ్వుతూ

తేరింతలు కొడుతూ వెళ్ళిపోయింది నాలుగో భార్య.

పక్కింటి స్త్రీ, నొసటి మీద కాసంత బొట్టూ, మెళ్లో పసుపుతాడూ. గోడకు నిచ్చెన వేసి ఎక్కి, గోడ మీద నుంచి ఈ తమాషా చూస్తూ ఉంది. ఆమెను చూడగానే నాకు పురాణ కాలంనాటి పతివ్రతలు గుర్తొచ్చారు, చెయ్యెత్తి మొక్కాలనిపించింది.

"ఎంత మగవాడివైనా ఇంత దుర్మార్గమా? చూస్తూ చూస్తూ నలుగురు పెళ్ళాలకు విడాకులిస్తావటయ్యా? నీకు బుద్ధి ఉందా లేదా? నీ పాపానికి నిష్కృతి ఉండదు." అన్నది గోడమీది పతివ్రత.

అల్లాయార్ ఖాన్ తలెత్తి ఆమెను కొరకొర చూశాడు.

"నీ మొగుడు పర్మిషన్ ఇస్తే నీకూ తలాక్ ఇచ్చేస్తాను," అన్నాడు వళ్ళుమండి.

"పర్మిషన్ ఇచ్చేస్తాను. బాబ్బాబూ! అదేదో చేసెయ్యి!" గోడ అవతల నుంచి మగ కంఠం వినిపించింది.

అల్లాయార్ ఖాన్ తెల్లముఖం వేశాడు.

"పర్మిషన్ ఇచ్చాడుగా! అనవేమయ్యా తలాక్ అనీ?" పతివ్రత తీవ్రంగా చూస్తూ అన్నది.

"లాభం లేదు నీ మొగుడు మా మతం పుచ్చుకోవాల్సి ఉంటుంది." అంటూ అల్లాయార్ ఖాన్ లోపలకు వెళ్ళిపోయాడు.

'పతివ్రత నిట్టూర్చి నిచ్చెన దిగింది. బలే ఉందయ్యా ముస్లింలా ఇష్టంలేక పోతే ఏ గొడవా లేకుండా భార్యాభర్తలు నిముషంలో విడిపోవచ్చును."

"మగవాడికి ఇష్టంలేక పోతేనే...' హనుమంతుడు వీణతీగలు సరి చేసుకుంటూ అన్నాడు

"అదేమిటి?"

"స్త్రీకి ఇష్టంలేకపోతే విడాకులు ఇచ్చి వెళ్ళిపోవడం అంత సులభం కాదు, హిందూ స్త్రీల కంటే ముస్లిం స్త్రీలకు స్వేచ్ఛ ఎక్కువ ఉందని భ్రమ పడుతున్నట్టున్నావ్? ఆ స్త్రీలకు మసీదు ప్రవేశం కూడా లేదు తెలుసా? అయ్యా హిందువేమిటీ, ముస్లిం ఏమిటీ? ఇది మగవాడి ప్రపంచం! ఈ ప్రపంచంలో ఆడవాళ్లకు న్యాయం కంటే అన్యాయమే ఎక్కువ జరుగుతుందనేది నిర్వివాదాంశం."

"మరి స్త్రీలకు పూర్తి స్వేచ్ఛ ఎప్పుడు వస్తుదంటావ్?"

"మానసిక బానిసత్వం వదిలిపోయిన రోజు.

అదెలా వదులుతుందంటావా? స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉన్న రోజు అది సాధ్యపడుతుంది. స్త్రీ ఏ పరిస్థితుల్లోనూ ఆర్థికంగా ఒకరిమీద ఆధారపడి ఉండ కూడదు అప్పుడే ఆమెలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది, మానసిక బానిసత్వం వదులుతుంది,"

"అది ఎలా వస్తుది?"

"స్త్రీలో పరిస్థితుల అవగాహనా, సాంఘిక చైతన్యమూ రావాలి."

"ఈ మాటలు ఎవరో పదేపదే అనడం విన్నానే? ఎవరబ్బా?"

"ఈ మాటలు ఒక రేమిటి అభ్యుదయ భావాలు ఉన్న ప్రతి ఒక్కరూ అంటూనే ఉన్నారు. వినీ వినీ చెవుల తుప్పు కూడా వదిలి పోయింది నాకైతే! సరే! వేచి చూద్దాం! ఆరోజు ఎప్పటికివస్తుందో!" *